# దరి

నడవలోని బల్లమీద కూర్చున్నానన్న మాటేగాని మనసంతా గదిలో ఉంది. చంద్రరావును ఉంచిన గదిలో హడావిడి ఏం తగ్గలేదు. పావుగంట కిందట ఆస్పత్రి పెద్ద డాక్టరు వచ్చి చూసి వెళ్ళాడు. ఆపరేషన్ థియేటర్ నుండి చంద్రరావును తీసుకొచ్చి గంటన్నర అయింది. లోపల ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులు ఉన్నారు. వాళ్లు బయటకు వస్తే లోపలికి వెళ్దామని ఉంది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచారు. ఇప్పటికే చాలామంది డాక్టర్లు వచ్చి చూసి వెళ్ళారు. అతనికి అంత మంచిపేరున్న విషయం నాకు తెలియదు. అతని గురించి నాకు తెలిసింది చాలా తక్కువేమో అనిపిస్తోంది. అతని గురించి పొరబడ్డారు.

నడవలో ఎవరూ లేరు. పగలంత వెలుగుగా ఉంది. ఎంత రాత్రి అయి ఉంటుందో తెలియడం లేదు. నా చేతిగడియారం హడావిడిలో ఊడి ఎక్కడ పడిపోయిందో తెలియదు. అది అతను ప్రేమతో కొనిచ్చింది. అతన్ని పారేసుకున్నట్టు చేతిగడియారాన్నీ పారేసుకున్నాను. లోపలికి వెళ్ళి అతన్ని చూసి కొద్దిసేపు కూర్చుని మాట్లాడదామని ఉంది. అతనితో పెళ్లయి ఇది ఆరో సంవత్సరం. పెళ్ళయిన వెంటనే పిల్లలు వద్దనుకుని కుటుంబనియంత్రణ పాటించాం. రెండు సంవత్సరాల తర్వాత నియంత్రణ మానేశాక ఒక పాప పుట్టి, పుట్టిన పదిరోజులకే చనిపోయింది. మరి సంతానం కలగలేదు. అతని సంగతి ఏమోకాని కావాలని నాకు ఎప్పుడూ అనిపించలేదు. కాలక్షేపానికి ఉద్యోగంలో చేరాను.

అరచేతుల వంక చూసుకున్నాను. రేఖలు గజిబిజిగా ఉన్నాయి. ఏ రేఖ ఏం సూచిస్తుంటుందో నాకు తెలియదు హృదయరేఖ ఒక్కటే గుర్తించగలను. నాకు గుండె కుడివయిపున ఉంది. కొంతమంది స్త్రీలకు ఎడమచేయి, పురుషులకు కుడిచేయి

చూడాలని అంటారు. చంద్రరావుకు హస్తసాముద్రికం తెలుసో లేదో నాకయితే తెలియదు కాని నారెండు చేతులూ చూసేవాడు. భవిష్యత్ గురించి ఎప్పుడూ చెప్పలేదు. జరిగిన వాటిల్లో అక్కడక్కడా నిజం తగిలేది. “నువ్వో పెద్దప్రమాదం నుండి తప్పించుకున్నావు” అని నాలుగయిదుసార్లు అన్నాడు. ఇంతవరకు ఎటువంటి ప్రమాదానికి గురికాలేదు. ఉత్తినే చేతులు చూయించుకునే దాన్ని కాని సాముద్రికం మీద నాకు ఎటువంటి నమ్మకం లేదు. అతనూ గట్టిగా నమ్మే వాడని నేను అనుకోను.

అరచేతులతో ముఖం తుడుచుకుని నా అరచేతుల్లోకి చూసుకున్నాను. నా ముఖం నాకు స్పష్టంగా అద్దంలో చూసుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. ఆశ్చర్యం వేస్తోంది. మునుపు ఎన్నడూ ఇలా జరగలేదు. నేను ఏ మాత్రం పొరపడడం లేదు. గుప్పిళ్లు మూసి తెరిచాను. ప్రతిబింబం కనబడలేదు. ఊపిరి తేలికగా పీల్చుకున్నాను.

మూడు సంవత్సరాల కిందట నా దగ్గరున్న వడ్డాణం పాలిష్ చేయించడానికి బంగారపు కొట్టతను దగ్గరకు వెళ్లాను. ‘ఇది అమ్మేసి వేరు ఏమయినా తీసుకోవచ్చు కదా’ అని కొట్టతను సలహా ఇచ్చాడు. దాన్ని నాకు అమ్మ ఇచ్చింది. మా అమ్మకు వాళ్ళ అమ్మ ఇచ్చిందట. వెడల్పుగా బొద్దుగా ఉండేదాన్ని నాకు అమ్మబుద్ధికాలేదు. దాన్ని నేనెప్పుడూ వేసుకోలేదు. నాకు చాలా పెద్దగా ఉంటుంది. ‘అమ్మను’ అని పాలిష్ చేయడానికిచ్చి, పాలిష్ చేసే అతని ఎదురుగా స్టూలు వేసుకుని కూర్చున్నాను. అతను మిగతా పనులన్నీ పక్కన పెట్టి నగ పాలిష్ చేయడం మొదలెట్టాడు. గంటయింది. రెండుగంటలు అయ్యాయి. అతను సమయం వృధా చేయకుండా ఓపికగా మెరుగు పెడుతున్నాడు. నగ కొత్తదవుతోంది. కూర్చో లేక నాకు విసుగొస్తోంది. ‘మెరుగు పెట్టింది చాలు బాబూ’అన్నాను. అతను ఆగి, ‘మీ ప్రతిబింబం అందులో కనబడడం అసలు మెరుగమ్మా’ అన్నాడు. ఈ సూత్రం జీవితానికి కూడా అన్వయిస్తుంది. నా చేతుల వంక మరొకసారి చూసుకున్నాను. నా ప్రతిబింబం కనిపిస్తోంది. మంచో, చెడో నాకు తెలియదు. భయం అనిపించింది. బెంచిమీద కూర్చోబుద్ధికాలేదు.

లేచి నిలబడ్డాను. డాక్టర్లు, నర్సులు నా ముందు నుండే గదిలోంచి బయటకు వచ్చారు. ‘ఆయనకు ఎలా ఉందని?’ అడుగుదామనుకునేంతలో త్వరత్వరగా నడుచుకుంటూ ముందుకు వెళ్ళిపోతున్నారు. వెనక ఉన్న నర్సును “సిస్టర్” పిలిచాను. ఆగి వెనక్కి తిరిగింది. నన్ను చూసింది. ఆయన పరిస్థితి అడిగే లోపల బట్టతల డాక్టరు సిస్టరును ఏదో అడిగేసరికి అతనికేదో సమాధానం చెబుతూ వరండా

మలుపు తిరిగారు. నాకు నా భర్త ఆరోగ్యం గురించి తెలుసుకునే అధికారం ఉంది. చంద్రరావు నాభర్తే.

గదిలోకి తొంగిచూశాను. అతను ఒక్కడే ఉన్నాడు. లోపలికి నడిచాను. గది నా మనసంత చల్లగా ఉంది. మెడవరకు దుప్పటి ఉంది. తలకు బాగా దెబ్బ తగిలినట్టుంది. బేండేజి ఉంది. బేండేజి రక్తం మరక పెద్దగా ఉంది. ముక్కుకు ఆక్సిజన్ గొట్టాలున్నాయి. మంచం పక్కగా వచ్చి మంచం మీద కూర్చున్నాను. అతను పడుకున్న పక్క మీద కూర్చుని రెండు సంవత్సరాలు దాటాయి. అతని కుడిచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. చేయి వేడిగా ఉంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువుగా ఉన్నాయి. ప్రమాదమేమీ లేదనిపిస్తోంది. కళ్లు తెరిచాడు.

"ఎలా ఉంది?" అడిగాను.

"బాధగా ఉంది". ఆగి, "నువ్వు వస్తావని అనుకోలేదు" అన్నాడు.

వద్దామని చివరి వరకు అనుకోలేదు. ఏ విషయంలోనూ త్వరగా ఒక నిర్ణయానికి రాలేకపోతుంటాను. చిన్నప్పటి నుండి అంతే. మారనేమో.

"డాక్టర్లేమన్నారు?" అడిగాను.

"నలభయి ఎనిమిది గంటల అబ్జర్వేషన్‌లో ఉండాలట. ఏం చెప్పలేక పోతున్నారు..." ఆయాసంగా ఉంది. ఆగాడు.

"నీకేం కాదు....." ఏడుపొస్తోంది.

❀ ❀ ❀

ఫేమిలీ కోర్టులో కూడా న్యాయమూర్తి ముందు ఒకరోజు చాలాసేపు ఏడ్చాను. నన్నెలా ఓదార్చాలో ఆయనకూ అర్థం కాలేదు. కోటు జేబులోంచి రుమాలు బయటకు తీసి పట్టుకున్నాడు. నాకు ఇవ్వడమా, వద్దా నిర్ణయించుకోలేక పోతున్నట్టనిపించింది. దుఃఖంలోంచి బయటకు వచ్చాక అడిగాడు, "నిన్ను బాధిస్తుంటాడా?"

తలూపాను.

"ఏ విధంగా?"

"నరక యాతనలు పెడుతుంటాడు. సిగరెట్ కాల్చి పీకతో..." ఎక్కడెక్కడ అంటించేవాడో చెప్పాను.

"కారణం ఏమిటి?"

"నాకూ తెలియదు"

"శాడిస్టా?"

ఏం చెప్పాలో అర్థం కాలేదు. చంద్రరావుకు సిగరెట్టు తాగే అలవాటు లేదు.

"నీమీద అనుమానమా?"

"నేనేం చేస్తున్నానని?"

"ఆహ. అలా ఏమయినా అనుమానపడుతున్నాడా."

తల అడ్డంగా ఆడించాను.

"నీ దగ్గర నుండి డబ్బులేమయినా తీసుకుంటాడా?"

"లేదు".

కౌన్సిలింగ్ చివరి రోజున న్యాయమూర్తితో అన్నాను. "నాకు విడాకులు తీసుకోవడం ఇష్టంలేదు. అప్పటికి వేరే ఎవరినీ చేసుకునే ఉద్దేశం అతనికి లేదని నాకు తెలుసు. ఆడవాళ్ల విషయాల్లో ఎటువంటి చొరవా చూపలేదు. నాకు ఉన్నంత ధైర్యం కూడా లేదు. అతన్నెందుకు వద్దనుకుంటున్నానో నిజానికి ఎటువంటి కారణం లేదు. అనవసరంగా అతన్ని రచ్చకీడ్చాలనిపించింది. అలా చేయకుండా ఉండవలసింది. నా మాటలకు న్యాయమూర్తి ఆశ్చర్యపోతూ నా ముఖంలోకి చూశాడు. "నీ భర్తతో నువ్వు కాపరం చేయాలి" అని తీర్పు ఇస్తాడనుకున్నాను. తీర్పు ఇంకా రాలేదు. వాయిదాల మీద కేసు నడుస్తోంది. చంద్రరావూ నేనూ ఒకే ఆఫీసులో పనిచేస్తూ ఉండటం వలన రోజూ కలుస్తూ ఉంటాం. పలకరించుకుంటూ ఉంటాం. కేంటీన్‌లో కలిసి అప్పుడప్పుడు కాఫీ తాగుతుంటాం. నేను వేరుగా ఉంటున్న సంగతి చాలామందికి తెలియదు. అతను మరొకరిని చేసుకోవడం నాకు ఇష్టం లేదు.

❀ ❀ ❀

"అతనేనా?" అడిగాడు చంద్రరావు.

తలూపాను.

"కంగ్రాచ్యులేషన్స్.. బావున్నాడు.. ఏం పేరు?"

"రఘు... రఘురాం."

"పెళ్ళి ఎప్పుడనుకుంటున్నారు."

"అతనికి పెళ్ళి అయింది."

"మరి?"

"అంతే" నిట్టూర్చాను.

రఘు మోటార్‌బయిక్ బీచ్‌రోడ్డు మీద అతివేగంగా నడుపుతోంటే అతని వెనక అతన్ని ఆనుకుని కూర్చుని ఉన్నాను. గాలి చొరబడటానికి ఇసుమంత స్థలమయినా మా మధ్యలేదు. అతని ఒంట్లోని వేడి నాలోకి పాకుతోంది. రోడ్డుమీద జనసంచారం అట్టేలేదు. నేనేదో చెబుతున్నాను. అతను వింటున్నాడు. చలిగాలికి వీధిదీపాలు ఒక్కొక్కటిగా వెనక్కి పారిపోతున్నాయి. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా మా ఇంటికి అతనితో వెళ్ళామనిఉంది. అతని చెవి కొరుకుతూ ఆమాటే అతనితో అన్నానో లేదో, తల తిప్పాడు. అప్పుడే రోడ్డుదాటుతున్న చంద్రరావును చూసుకోలేదు. బ్రేకు వేయడం కొద్దిగా ఆలస్యమయింది. అప్పటికే చంద్రరావు అయిదారు అడుగుల ఎత్తుకు ఎగిరి రోడ్డు అవతల ఉన్న రాళ్ళ గుట్టమీద పడ్డాడు. గుండెలు అవిసేలా కేకవేసిన గుర్తు.

"రఘుకు ఎలా ఉంది?" అడిగాడు.

తలుపు దగ్గర చప్పుడయింది. నర్సులు, డాక్టర్లు మళ్ళీ వస్తున్నట్లుంది. మంచం దిగి గోడ పక్కగా నిలడ్డాను. డాక్టరెవరూ రాలేదు. నర్సు, మొద్దుగా ఉన్న వార్డుబాయ్‌లు లోపలకు వచ్చారు. చంద్రరావు ముఖంలోకి చూస్తూనే నర్సు తల అడ్డంగా ఆడించి, "ప్చ్" అంది.

ఆక్సిజన్ సిలిండర్ నర్సు ఆపుతోంటే అతను చంద్రరావుకు పెట్టిన ట్యూబులన్నీ తీసేస్తున్నాడు. సిలండరు పక్కకు లాగి దుప్పటి అతని తలనిండా కప్పింది నర్సు.

ఇహ అక్కడ నాకు ఏ పనీలేదు. రఘు ఇంకా రోడ్డుమీద పడి ఉన్నాడో, ఏ ఆస్పత్రికయినా తరలించారో తెలియదు. నేను చనిపోయానన్న ఆలోచనే బాధగా ఉంది.

❖